సాక్షి
బాపట్ల
ఆదివారం । 9 । మార్చి । 2025



ప్రసన్నాంజనేయస్వామి జయంతి

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో ప్రసన్నాంజనేయస్వామి జయంతి మహోత్సవం సందర్భంగా శని వారం లక్ష తమలపాకుల పూజ చేశారు.



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి.

నేడే ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలం లోని గోగులపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
బాపట్ల	6.22	5.04
గుంటూరు	6.22	5.04
నరసరావుపేట	6.24	5.06

న్యూస్‌రీల్

చీరాల మహిళకు కేంద్ర ప్రభుత్వ ఎక్స్‌లెన్సీ అవార్డు



చీరాల అర్బన్: వ్యాపార కార్యకలాపాలను తనదైన శైలిలో కొనసాగించి అధిక రాబడులు తెచ్చేందుకు కృషి చేసిన గాలంకి మేరికి కేంద్ర ప్రభుత్వ ఎక్స్‌లెన్స్ అవార్డును శనివారం ఢిల్లీలో అందించారు. చీరాలకు చెందిన గాలంకి మేరి.. వెస్టేజ్ కంపెనీకి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలను తనదైన శైలిలో అధిక రాబడు లను తెచ్చేందుకు కృషి చేశారు. దీంతో ఆమెకు డైరెక్ట్ సెల్లింగ్ ట్రెనింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌లెన్సీ అవార్డును కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ చేతుల మీదుగా అందించారు

రాజాధిరాజ వాహనంపై నారసింహుడు



మంగళగిరి/ మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడు కల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం స్వామి వారు రాజాధిరాజ వాహనంపై దర్శన మిచ్చా రు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయు డు కళావేదికలో భక్తి గీతాలు, కూచిపూడి నృ త్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవం లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షిం చగా కైంకర్యపరు లుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని శైలేంద్ర వ్యవహరించారు. స్వామివారు ఆది వా రం రాత్రి యాలివాహనంపై దర్శనమివ్వ నున్నారు.

వెంకన్న ఆలయంలో గోవింద నామస్మరణ



రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరుగాం చిన దేవరంపాడు కొండపై స్వయంభూగా వెలసిన శ్రీనేతి వెంకన్నస్వామి రెండవ శని వారం తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాల నుంచే గాక సుదూర ప్రాంతాల నుం చి వేలాదిమంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొండపై స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు కన్నులారా తిలకించారు. అనంతరం స్వామివార్లను పల్లకీలో ఊరేగించారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో గణపతి సురేష్ తెలిపారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపుయార్డు సమీపం లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థా నంలో రెండో శనివారం వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో సుప్రభాతసేవ, నవనీత హారతి, నిత్య కైంకర్యాలు, నవకుం భారాధన, నరసింహ హోమం, సాయంత్రం నిత్య హోమం, ఆలయ బలిహరణ జరిగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్రులు పర్యవేక్షించారు.

పచ్చ ముఠా చౌక బియ్యం

దోపిడీకి నిలువుటద్దం

- ప్రతి నెలా లక్ష క్వింటాళ్ల దందాలో కీలకంగా అద్దంకి ముఠా
- పర్చూరు, బాపట్ల, దర్శి, వినుకొండ, ఒంగోలులో సేకరణ
- పాలిషింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఓ రైస్ మిల్లు లీజుకు
- పచ్చనేతలకు నెలకు రూ.కోట్లలో ఆదాయం
- మంత్రి పేరు చెప్పి నేరుగా బెదిరింపులు
- ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి తరలింపు
- తొలుత కృష్ణపట్నం పోర్టుకు.. ఆపై దక్షిణాఫ్రికాకు చేరవేత



సాక్షి ప్రతినిధి, బాపట్ల : పేదలకు అందాల్సిన చౌక బియ్యం... పచ్చ నేతలకు కాసులు కురిపించే వ్యాపార వస్తువుగా మారిపోయింది. అన్నం ముద్దగా నిరుపేదల నోట్లోకి వెళ్లాల్సిన బియ్యం.. అధికార పార్టీ నాయకుల జేబులు నింపే అక్రమ దందాకు ఉపయోగపడుతున్నాయి. నెలకు లక్ష క్వింటాళ్లు సేకరిస్తూ.. వాటి పాలిషింగ్‌కు ఏకంగా ఓ రైస్‌మిల్లునే లీజుకు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎంత దండుకుం టుకున్నారో తెలుసుకోవచ్చు. అద్దంకి నియోజకవ ర్గానికి చెందిన రాఘవ, రాము, హనుమంతరావు, ప్రకాశం జిల్లా ఒంగోలు వాసి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన అంజితో కూడిన ముఠా చౌక బియ్యాన్ని తరలించి పెద్దఎ త్తున అక్రమార్జనకు పాల్పడుతోంది. రాఘవ బాప ట్ల జిల్లా పర్చూరు, అద్దంకి, బాపట్ల, చీరాల, ప్రకాశం జిల్లా దర్శి, యర్రగొండపాలెం, సంతనూ తలపాడు, కనిగిరి తదితర ప్రాంతాల నుంచి, అం జి పల్నాడు జిల్లా వినుకొండ, చిలుకలూరిపేట తది తర నియోజకవర్గాలలో డీలర్ల నుంచి నేరుగా ప్రతి నెలా 1 నుంచి 15 మధ్య బియ్యాన్ని సేకరిస్తు న్నారు. వీటిని పాలిషింగ్ చేసేందుకు ఒంగోలు, అద్దంకి ప్రాంతాల్లో ప్రత్యేకంగా మిల్లు లీజుకు తీసు కోవడం గమనార్హం. నెలకు సుమారు లక్ష క్వింటాళ్ల బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి కంటైనర్లలో దక్షిణాఫ్రికాకు చేరవే స్తున్నారు.

కాసుల పంట..

పలు నియోజకవర్గాల పచ్చ నేతలకు చౌక బియ్యం దందా కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రారంభంలో నెలకు రూ.12 లక్షలు తీసు కున్నవారు.. 4 నెలలు తిరగకముందే కప్పాన్ని భారీగా పెంచేశారు. చీరాల పచ్చ నేతకు బియ్యం మాఫియా నెలకు ఏకంగా రూ.25 లక్షలు చెల్లిం చేలా ఒప్పందం కుదుర్చుకుంది. 2 నెలల అడ్వాన్స్ కింద అక్షరాలా రూ.50 లక్షలు ఇచ్చేశారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో పచ్చ నేత ప్రధాన అను చరులకు బియ్యం మాఫియా కప్పం చెల్లిస్తుండగా.. బాపట్ల మాఫియా పచ్చ నేత బంధువుకు నెల మామూళ్లు ఇస్తున్నారు. వేమూరు, రేపల్లెతో పాటు మిగిలిన నియోజకవర్గాల పచ్చ నేతలకు సైతం ఇప్పుడు బియ్యం మాఫియా రేటు పెంచి రూ.25 లక్షలు చెల్లిస్తోంది. ఒంగోలు అధికార పార్టీ నేతకు అత్యధికంగా నెలకు రూ.30 లక్షలు చెల్లిస్తున్నట్లు మాఫియా ముఠాలోని ఓ సభ్యుడు తెలిపారు.

బియ్యం లారీ ముందు పైలట్ వాహనాలతో..

పాలిషింగ్ తర్వాత బియ్యాన్ని రాత్రివేళ లారీల ద్వారా కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. బియ్యం లారీ పోర్టుకు వెళ్లేవరకు ముందు రెండు కార్లలో మాఫియా ముఠా సభ్యులు పైలట్‌గా వెళ్తున్నారు. ఎక్కడికక్కడ అధికారులకు మామూళ్లు చెల్లిస్తున్నారు. బియ్యం సేకరిస్తున్న నియోజకవర్గాల పరిధిలో కొందరు విజిలెన్స్, సివిల్ సీఐలకు రూ.50 వేలు, ఎస్ఐలకు రూ.15 వేలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి, పౌర సరఫ రాల అధికారులకు రూ.50 వేల చొప్పున ఇస్తు న్నట్లు సమాచారం. ఒక్కో చెక్ పోస్టుకు రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు.

బియ్యం కొనుగోళ్లు ఇలా.. ఇవ్వకపోతే బెదిరింపులు

చౌకబియ్యం మాఫియా డీలర్లకు కిలోకు రూ.15 నుంచి రూ.17 చెల్లిస్తుండగా కొన్నిచోట్ల బియ్యం సేకరించిన స్థానిక వ్యాపారికి కిలోకు రూ.22 నుంచి రూ.24 ఇస్తోంది. డీలర్లు కార్డుదారులకు కిలోకు గతంలో రూ.8 ఇవ్వగా ప్రస్తుతం కిలోకు రూ.10 చెల్లిస్తున్నారు. అద్దంకి ముఠా సభ్యులు మంత్రి పేరు చెప్పి ఆయా నియోజకవర్గాల పచ్చ నేతలతో పాటు స్థానికంగా అక్రమ బియ్యం వ్యాపారం సాగిస్తున్నవారిని బెదిరిస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో వేరే వారికి బియ్యం ఇవ్వడం లేదా సొంతంగా పెద్ద వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని కృష్ణపట ్నం పోర్టుకు బియ్యం తరలించినవారు అద్దంకి బ్యాచ్‌కు బియ్యం ఇచ్చేందుకు తొలుత నిరా కరించారు. దీంతో వారిని మంత్రి పేరుచెప్పి బెదిరించారు. అక్రమ కేసులు పెడతామని హెచ్చరించినట్లు కొందరు వ్యాపారులు చెబుతు న్నారు.

యువతను మోసం చేసిన చంద్రబాబు



యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

- 12న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువతపోరు
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

బాపట్లటౌన్: ఎన్నికలకు ముందు నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున అన్నారు. వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శని వారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లా డారు. తొలుత ఈనెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. నాగార్జున మాట్లా డుతూ పేద విద్యార్థులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఐదు త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెం ట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టి రాక్షసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం కారణం గా పేద విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపో తున్నా సర్కార్ చోద్యం చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ పథకాన్ని నాడు వైఎస్సార్ ప్రవేశపెడితే ఆ పథకాన్ని మరో మూడు అడుగులు ముందుకు వేసి అమలుచేసిన ఘనుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎ స్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో విద్యా దీవెనకు రూ.12,609 కోట్లు ఖర్చుచేశారన్నారు. వీటితోపాటు వసతి దీవెనకు మరో రూ.6 వేల కోట్లు ఖర్చుచేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, లేకుంటే ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3 వేలు అందజేస్తామని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలంటే బడ్జెట్‌లో రూ.7200 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని కనీసం బడ్జెట్‌లో ప్రవేశపెట్టక పోవడం దారుణమన్నారు. పేదల ఆరోగ్యాన్ని మెరుగుపర్చాలనే సదుద్దేశంలో వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాలను తీసుకువస్తే వాటిని ప్రైవేటీక రణ చేసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కూటమి పాలనలో పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం విద్య, ట్యాబ్‌ల పంపిణీ, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద లాంటి పథకాలు దూరమయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి, జిల్లా యువత విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెం చయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఈదా శ్రీని వాసరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు వాసు, మైన ర్టీవిభాగం జిల్లా అధ్యక్షులు జపరున్నీసా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, జిల్లా ప్రచారకమిటీ అధ్యక్షులు వడ్డిముక్కల డేవిడ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గవినికృష్ణ మూర్తి పాల్గొన్నారు.

తెగుళ్ల ఘాటు.. రైతుకు చేటు

- వాతావరణ మార్పులతోనే మిరపకు తెగుళ్లు
- దిగుబడులపై నీలినీడలు.. తల్లడిల్లుతున్న రైతన్న
- జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో మిరప సాగు
- ఎకరానికి రూ.1.2 లక్షలు నష్టం వచ్చే అవకాశం



కల్లాల మీద ఆరబోసిన మిరపకాయలు

కారంచేడు: గతేడాది మిరపకు కొంత వరకు మం చి గిట్టుబాటు ఉంది. దీంతో ఈ ఏడాది మిర పను సాగు చేసేందుకు మరికొంత మంది రైతులు ముందుకొచ్చారు. అప్పుల బాధ నుండి గట్టెక్కవచ్చని ఆశించిన రైతన్నలకు ఈ ఏడాది మిరప నష్టాలే మిగిల్చేలా ఉంది. జిల్లాలో సుమారు 54 వేల హెక్టార్ల (1లక్షా 35 వేల ఎకరా లు)లో మిరప సాగు చేశారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో మిరప పంటకు ప్రధానం గా నల్లి తెగుళ్లు, బూడిద తెగులు, పండాకు, కొమ్మ ఎండు తెగుళ్లు వంటివి ఆశించాయి. వీటి వలన దిగుబడులు ఘోరంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయాధికారులు, హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు మార్కె ట్‌లో ఎన్ని రకాల నివారణ మందులున్నాయో వాటినన్నింటినీ పిచికారీ చేశామని వాపోతు న్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

గతేడాదితో పోల్చుకుంటే భూమి కౌలు నుంచి పంట చేతికందే వరకు అయిన సాగులో ఖర్చులు విపరీతంగా పెరిగాయని రైతులు చెబుతున్నారు. నీటి ఖర్చులు, కోతలకు మొత్తం ఎకరానికి రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు.

గణనీయంగా తగ్గిన దిగుబడులు

గతేడాదితో పోల్చుకుంటే మిరపలో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరానికి 15–20 క్విం టాళ్ల దిగుబడి వస్తే అందుకు తగ్గట్లుగానే క్వింటా బస్తా ధర రూ.17–18 వేల వరకు వచ్చింది. ఈ ఏడాది ఎకరానికి 5–15 బస్తాలకు మించి దిగుబ డులు వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం మార్కెట్ ధర కూడా రూ.12వేలు మాత్రమే ఉంది. అంటే సగటున ఎకరానికి రైతులు 15 బస్తాల దిగుబడి వస్తే కనీసం రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలు నష్ట పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధరలపైనే ఆశలు..

గతేడాది ప్రభుత్వం మిరప పంటకు మంచి గిట్టు బాటు ధరలు కల్పించింది. గ్రామాల్లో వారు సాగు చేసిన చేల వద్దకు వచ్చిన వ్యాపారులు క్వింటాకు రూ.18000 వరకు ఇచ్చి కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఇప్పటికి రూ.12000కు మిం చి రావడం లేదు. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు రూ.11,800 ప్రకటిస్తే, ఇక దళారులు, వ్యాపా రులు ఎవరు వచ్చి కొంటారని రైతులు ప్రశ్నిస్తు న్నారు. ప్రభుత్వం కనీస గిట్టుబాటు ధర రూ.18000కు పెంచితేనే వ్యాపారుల నుంచి పోటీ వస్తుందని, అప్పుడే రైతుకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు.


ఎకరాకు ఎంతో నష్టం



ఈ ఏడాది సాగులో మిరప పంటకు నల్లి తెగులు సోకింది. వాటిని నివారించేం దుకు పురుగు మం దులను వినియోగిం చాల్సి వచ్చింది. పురుగుమందులకే ఎకరా నికి కనీసం రూ.1.2 లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇక సాగు ఖర్చులతో కలిపి ఎకరా నికి కనీసం మూడు లక్షలు అయ్యాయి. గతేడాది బస్తా రూ.18 వేల వరకు ఉంటే ఈ ఏడాది రూ.12 వేలకు మించడం లేదు. ఇలా గైతే నష్టపోవాల్సిందే.

–పోతిని వెంకట్రావు, పోతనివారిపాలెం

గిట్టుబాటు ధరలు కల్పించాలి



ఈ ఏడాది మిరపకు విపరీమైన తెగుళ్ల వచ్చాయి. తెగుళ్ల మం దులకే ఎకరాకి రూ.ల క్షకు పైగా ఖర్చు చేశాం. ప్రభుత్వం మిరపకు కనీస గిట్టుబాటు ధరను రూ.18 వేలకు పెం చాలని కోరుతున్నాం. బస్తా రూ.18 వేలకు పైగా ఉంటేనే రైతులు నష్టాల నుంచి గట్టెక్క గలుగుతారు.

–నక్కా రామకృష్ణ, రైతు కారంచేడు

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.28.5కోట్ల చెక్కులు పంపిణీ
- రేపల్లెలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రి అనగాని, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ తదితరులు

రేపల్లె రూరల్: కట్టుబాట్ల పేరుతో వంటింటికే పరి మితమైన మహిళలు నేడు అంతరిక్షాన్ని చుట్టివచ్చే స్థాయికి ఎదిగారని, మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగల సత్తా ఉందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రేపల్లె పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించారు. మంత్రి కొలుసు మాట్లా డుతూ మహిళలు పురుషులకు దీటుగా అన్ని రం గాల్లో రాణిస్తున్నారని, మరింత అభివృద్ధి చెం దాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం మహిళలు కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించి వారి జీవితాలను చక్కగా తీర్చిదిద్దాలని అన్నారు. నవంబర్ నుంచి 80 లక్షల మంది మహిళలకు రూ.35 వేల కోట్ల సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయ డానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దీపం–2 పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రూ. 9వేల కోట్లతో తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చం ద్రబాబునాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టార న్నారు. సమాజానికి మహిళలు అపారమైన సేవలు అందించారని వారిని ప్రతిరోజు గౌరవించాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంద ర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 592 స్వయం సహాయక సంఘాలకు రూ.13.6 కోట్ల చెక్కును, పీఎంఈజీపీ కార్యక్రమం క్రింద 75 స్వయం సహాయక సంఘాలకు రూ.1.95 కోట్ల చెక్కును, రేపల్లె మెప్మా ద్వారా 169 స్వయం సహా యక సంఘాలకు రూ.13.5 కోట్ల చెక్కులను మం త్రులు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 33 మంది మహిళలను రాష్ట్ర మం త్రులు సన్మానించారు. కార్యక్రమంలో శాసనమం డలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ, నెడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెం ట్ అథారిటీ చైర్మన్ రాజశేఖర్‌బాబు, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, రేపల్లె ఆర్డీఓ ఎస్.రా మలక్ష్మి, రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశి వరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, పార్థసారథి

స్టాల్స్‌ను ప్రారంభించిన మంత్రులు

మహిళలు, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులు, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. స్వయం సహాయక సభ్యులు ఏర్పాటు చేసిన తినుబండారాలు స్టాళ్లను, చేనేత మహిళలు నేసిన నేత చీరల స్టాల్‌ను, స్వయం ఉపాధి పొం దుతున్న మహిళలు తయారు చేసిన జూట్ బ్యాగ్ లను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థినుల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

లోక్ అదాలత్‌లో 210 కేసులు పరిష్కారం

బాపట్ల:బాపట్ల మండల న్యాయ సేవాధికార సం స్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను శని వారం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించడానికి మూడు బెంచీలను ఏర్పాటు చేశారు. మొత్తం 210 కేసులు పరిష్కరిం చారు. వీటిలో 15 సివిల్ కేసులు, 184 క్రిమినల్ కేసులు, 11ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయి. మొత్తం రూ.1,02,56,577 లావాదేవీలు జరిగా యి. బాపట్ల ఆరో అదనపు జిల్లా జడ్జి కె.శ్యాం బాబు, జి వాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్‌లు కేసులను పరిష్కరించారు. ఏపీపీ మహేంద్రనాథ్, బాపట్ల బార్ అసోసియే షన్ అధ్యక్షులు వి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

భావన్నారాయణుడిని తాకిన సూర్యకిరణాలు

చినగంజాం: మండలంలోని పెద గంజాం గ్రామంలోని భావన్నా రాయణస్వామి ఆలయంలో స్వామి మూలవిరాట్ పాదాలను శనివారం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి ఏడాది మార్చి మొదటి వారం, సెప్టెంబరు నెల చివరి వారంలో సూర్యుని లేత కిరణాలు స్వామి వారి పాదా లను అభిషేకిస్తాయి. ఈ సుందర దృశ్యాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వేకువ జామునుంచే ఆలయానికి చేరుకొని కనులారా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. ఇటువంటి సుందర దృశ్యం ఏడాదిలో రెండు పర్యా యాలు సంభవించటంతో పాటు సుమారు వారం రోజులపాటు ఇదే విధంగా దర్శనమిస్తాయి. శనివారం తొలి రోజు పాక్షికంగా పడిన సూర్యకిరణాలు ఆదివారం నుంచి మరింత ఎక్కువగా పడేందుకు అవకాశం ఉం దని ఆలయ పూజారి తెలి యజేశారు. ఈ సుందర దృ శ్యాన్ని తిలకించేందుకు శని వారం ఉదయం స్థానికంగా ఉండే భక్తులు మాత్రమే ఆల యానికి విచ్చేసి తిలకిం చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.



భావన్నారాయణుడిని పాక్షికంగా అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

క్లుప్తంగా

జాతీయ లోక్‌అదాలత్‌లో 96 కేసులు పరిష్కారం



రేపల్లె రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ.వెంకటేశ్వర్లు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు హాలులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన కేసులు పరిష్కరించి మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించటం జరుగుతుందన్నారు. 11 సివిల్, 83 క్రిమినల్, 2 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



స్వర్ణ(కారంచేడు): గ్రామంలో నూతనంగా మంజూరైన మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, అలా కాదని గ్రామంలోని ప్రజల మధ్య ఏర్పాటుచేస్తే సహించేది లేదని గ్రామానికి చెందిన మహిళలు శనివారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో కారంచేడు-ఇంకొల్లు ప్రధాన రహదారికి ఆనుకొని కొమ్మమూరు కాలువకు సమీపంలో గతంలో ఇక్కడ నిర్వహించిన మద్యం దుకాణంలోనే మరలా నూతనంగా గౌడ సామాజికవర్గ రిజర్వేషన్ దుకాణం ఇక్కడ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతుండటంతో ఈ ఆందోళన చేపట్టారు. గతంలో ఇక్కడ దుకాణం ఉండటం వలన అనేక అగ్ని ప్రమాదలు, గొడవలు జరిగాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ఈ దుకాణంను ఊరికి చివరన ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

ఆయనకు ఆటే శ్వాస..ప్రాణం

- ఆరు పదుల వయస్సులో అలవోకగా విజయాలు
- విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన వైనం
- జాతీయ స్థాయిలో పతకాల పంట
- వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి సాధిస్తున్న విజయాలు



విద్యార్థులకు తర్ఫీదునిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి

చెరుకుపల్లి: ఆయన ఆటలంటే ప్రాణం. చిన్నతనం నుంచి ఆటల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ ఆసక్తితోనే చివరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆరు పదుల వయసులోనూ తరగని ఉత్సాహం ఆయన సొంతం. జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడు. నిత్య విద్యార్థిగా ప్రతిరోజూ సాధన చేస్తూ ఎందరో విద్యార్థులకు ఆయా క్రీడలలో అత్యుత్తమ శిక్షణ ఇస్తూ ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన తుమ్మ శ్రీనివాసరెడ్డి వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సాధించిన విజయాలు

గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 2012లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో 50 మీటర్ల లాంగ్ జంప్‌లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాడు. 2013, 2014 సంవత్సరాలలో విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ట్రిపుల్ జంప్ పోటీలలో బంగారు పతకం పొందాడు. 2015లో గుంటూరులో జరిగిన రాష్ట్ర పోటీలలో 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ విభాగాలలో బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. గతేడాది మధ్యప్రదేశ్‌లో జరిగిన 37వ జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో 50 మీటర్ల విభాగం, 100 మీటర్ల విభాగంలో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించాడు.



జాతీయ స్థాయిలో సాధించిన బంగారు పతకాలతో శ్రీనివాసరెడ్డి

విద్యార్థులను తీర్చిదిద్దుతూ..

భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి విద్యార్థులు పతకాలు సాధించేలా తర్ఫీదు నిస్తున్నారు. తాను పని చేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన పర్యవేక్షణలో శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో అనేక పతకాలు సాధించారు. జిల్లా యోగ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఆటలతోపాటు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. 2013వ సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కించుకున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



తల్లిదండ్రులు, స్నేహితుల ప్రోత్సాహంతో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. 1998 సంవత్సరంలో పీఈటీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అనేక మంది విద్యార్థులను క్రీడాకారులుగా తయారు చేయటం ఆనందంగా ఉంది. వీరిలో 357 మంది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించారు. 28 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఆంధ్ర జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

– శ్రీనివాసరెడ్డి, పీఈటీ

చెట్టుకు వేలాడిన కళేబరం

- కొంత కాలం కిందట వ్యక్తి ఆత్మహత్య
- అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

బల్లికురవ: గుర్తు తెలియని వ్యక్తి ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామం నుంచి సోమవరప్పాడు వెళ్లే దారిలో ఉన్న కొండ సమీపంలో వేపచెట్టుకు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఈ ఘటన జరిగి చాలా రోజులు కావటంతో శవం.. కళేబరంగా మారింది. శనివారం పాఠశాలలకు సెలవు కావటంతో ఆడుకునేందుకు అటు వైపు వెళ్లిన విద్యార్థులు చెట్టుకు వేళ్లాడుతున్న కళేబరం గుర్తించగా.. తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జీవీ చౌదరి, రైటర్ ఆంజనేయులు, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్‌టీపీ ప్లాంట్ పరిశీలన



తెనాలిఅర్బన్: తెనాలి పూలే కాలనీలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పబ్లిక్ హెల్త్ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ మరియన్న పేర్కొన్నారు. శనివారం ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించి నిర్మాణాలపై ఆరా తీశారు. మిగిలిన చిన్న చిన్న మరమ్మతులను పూర్తి చేయాలని, గ్రీనరీని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సచివాలయాల పరిధిలోని ఇమ్యూనిటీ సెక్రటరీలకు ఎస్‌టీపీ పనితీరుపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పూలే కాలనీలో సుమారు రూ.30 కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మించడం జరిగిందన్నారు. దాదాపు పనులు పూర్తయ్యాయని, కొద్ది రోజులుగా ట్రయిల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్ర మంత్రులతో దీనిని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డీఈ శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈలు సుబ్బారావులు, శ్రీనివాసరావు, ఏఈలు ఫణీ, సూరిబాబు, సునీల్ ఉన్నారు.

భారీ చోరీలపై కీలక ఆధారాలు లభ్యం

ప్రత్యేక బృందాలతో గాలింపు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో భారీ చోరీ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, సీసీఎస్, పట్టాభిపురం పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే చోరీలకు సంబంధించి కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. వివరాలు.. విద్యానగర్ 3/6 ప్రాంతంలో ఒకే రోజు రెండు ఇళ్లల్లో రూ.2.50 కోట్ల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ ఘటన సంచలనం సృష్టించింది. చోరీ చేసిన వైనాన్ని సీసీ ఫుటేజ్ ద్వారా పరిశీలించిన పోలీసులు దొంగతనానికి పాల్పడిన వారు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన వారుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనుమానితులుగా ఉన్న వారిని అదుపులో తీసుకుని విచారణ చేస్తున్నారు. చిరంజీలాల్ ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి అయితే నూతన భవన నిర్మాణ పనులకు వచ్చిన వారిని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో మూడు నెలలు క్రితం ఎస్‌వీఎన్ కాలనీ, బృందావన్ గార్డెన్స్‌లో రిటైర్డ్ డీఎస్పీ నివాసంలో కూడా ఇదే తరహాలో కోట్ల రూపాయలు విలువ చేసే బంగారు ఆభరణాలను చోరీ ఘటన చోటుచేసుకుంది. గతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి దొంగలు దొరికారు కాని చోరీకి గురైన బంగారం మాత్రం ఇంత వరకు రికవరీ చేయలేకపోయారు. దొంగతనం చేసిన వారిని సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన పట్టాభిపురం పోలీసులు చోరీ చేసిన వ్యక్తులు మహారాష్ట్రకు సంబంధించిన వారుగా గుర్తించారు. నేరస్తులను పట్టుకునేందుకు పట్టాభిపురం సీఐ, సిబ్బందితో ముంబాయి నగరానికి వెళ్లారు. అయితే ఇంత వరకు ఆ కేసు కొలిక్కి రాలేదు. ప్రస్తుత ఎస్పీ సతీష్‌కుమార్ కేసు ఛేదనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం.

అత్యల్ప ఆదాయం ఉన్న వారిని గుర్తించేందుకే పి–4 సర్వే

జిల్లా కలెక్టర్ వెంకట మురళి



రేపల్లెలో పీ-4 సర్వే నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

రేపల్లె రూరల్: సమాజంలో అత్యల్ప ఆదాయం కలిగిన వారిని గుర్తించి ఆదుకునేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. పీ–4 సర్వే కార్యక్రమాన్ని పట్టణంలో శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పబ్లిక్ ప్రైవేటు అండ్ పీపుల్స్ పార్టనర్ షిప్ (పీ–4) పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించి ఆదుకోవటమే సర్వే ముఖ్యోద్దేశమన్నారు. ఈ పథకాన్ని ఉగాది పండుగ నుంచి ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించనున్నదన్నారు. ఉపాధి నాటికి సర్వేను పూర్తి చేసి ప్రభుత్వానికి వివరాలను అప్పగిస్తామన్నారు. బాపట్ల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సర్వే ప్రారంభించటం ఆలస్యమైందన్నారు. ఫేజ్–2లో 8వ నుంచి 18వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. నిరుపేదలను గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి పర్యటించి సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుతోనే పేదలకు మేలు

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల: బాపట్లలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని చూడటం ఈప్రాంత ప్రజలకు తీరని అన్యాయమని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని 17 మెడికల్ కళాశాలలు నిర్మించేందుకు ముందుకురావటం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల వలన వైద్యంతోపాటు వైద్య విద్యార్థులు కూడా వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ కళాశాలను తీసుకురావటం జరిగిందన్నారు. బాపట్ల కాకుండా మరోప్రాంతానికి మెడికల్ కళాశాల వెళ్లే అవకాశం ఉనప్పటికి ఖచ్చితంగా బాపట్లలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికే అవకాశం ఇచ్చారని తెలిపారు. బాపట్లలోనే కళాశాల ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ నుంచి స్థల సేకరణ చేపట్టి కళాశాల ఏర్పాటు చేయించామని తెలిపారు. 80 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి కూడా ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాజాగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలని ముందుకు రావటం వలన పెత్తనం మొత్తం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతుందని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్ష పండులా ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఈ ప్రాంత ప్రజలందరూ ఆలోచించి కళాశాల కోసం ఒకతాటిపైకి రావాలని కోరారు.

ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



డాక్టర్ జి.నిరుపమను సన్మానిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని

బాపట్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యం వచ్చినట్లుగా భావించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అపోలో స్పెక్టర్ చీరాల వారి సౌజన్యంతో బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఉచిత మెడికల్ క్యాంపు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. డాక్టర్ ముప్పలనేని మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను సాధించేందుకు ఐక్యంగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భావితరాలకు మంచి పౌరులను అందించే అవకాశం స్త్రీలకే ఉందని, ఇంట్లో తమ పిల్లలను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఈ.జి కే.మూర్తి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం అమానుషం



మాట్లాడుతున్న దళిత నాయకుడు స్వరాజ్ కుమార్

పర్చూరు(చినగంజాం): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను తగులబెట్టడం అమానుష చర్య అని వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు గేరా స్వరాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పర్చూరు బొమ్మల సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను జనసేన పార్టీ నాయకులు తగులబెట్టడంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జగన్‌మోహనరెడ్డిని విమర్శించిన తరువాత మాత్రమే ఆయన ప్రతి విమర్శ చేశారని, కానీ ఆయన చేసిన విమర్శ వాస్తవమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన దగ్గర నుంచి ఒకే ఒక్కడు పోరాటం చేసి ముఖ్యమంత్రి కాగలిగాడని, కానీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముందు ప్రజారాజ్యం పార్టీతో మొదలు పెట్టి వెనుదిరిగారని, జనసేన పార్టీని స్థాపించిన దగ్గర నుంచి ముందుగా బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. తరువాత సీపీఎం, సీపీఐలతో పొత్తు, ఆటు తరువాత బీజేపీ, తదుపరి టీడీపీలతో పొత్తులు పెట్టుకొని, ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేని పరిస్థితుల్లో ఆయన కూటమి కట్టి ఎంఎల్ఏ అయ్యారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి చేసిన విమర్శను సద్విమర్శగా తీసుకొని ఒంటరిగా పోటీ చేసి గెలుపును సాధించాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓడిపోయినప్పటికీ 40 శాతం ఓట్లు సాధించగలిగిన పార్టీ అన్నారు. కూరాకుల కిరణ్, నలిగల ప్రభుకుమార్, పి. జయకృష్ణ, కాకులూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భయమే కాటేసింది

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన చిన్న పోలు

మార్టూరు: మనోవేదనతో పాటు భయం వల్ల ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం వెలుగు చూసింది. వలపర్ల ఎస్సీ కాలనీకి చెందిన తాళ్లూరి చిన్న పోలు (36) తన భార్యతో కలిసి రెండు నెలలుగా నెల్లూరు జిల్లాలో పొగాకు పనుల నిమిత్తం వెళ్లారు. అతను చాలా కాలంగా మానసిక వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో చిన్న పోలు అనారోగ్యం బారిన పడటంతో భార్య నాలుగు రోజుల కిందట వలపర్ల తీసుకొని వచ్చి వైద్యులకు చూపించగా పసికర్ల వ్యాధిగా గుర్తించి చికిత్స చేస్తున్నారు. రెండు రోజుల కిందట చిన్న పోలు భార్యతో కలిసి బల్లికురవ మండలం లోని కొణిదెనలో గల ఆమె పుట్టింటికి వెళ్లారు. శుక్రవారం ఒక్కడే బైకుపై వలపర్ల వచ్చి ఇంట్లో ఉన్న బంగారు ఉంగరాన్ని స్థానికంగా తాకట్టు పెట్టి పది వేలు అప్పు తీసుకున్నాడు. అందులో ఐదు వేల రూపాయలు తన తల్లికి ఇచ్చి మిగిలిన రూ. 5 వేలు తనవద్ద ఉంచుకొని గ్రామంలో మద్యంతో పాటు నువాక్రాన్ పురుగుల మందు కొనుగోలు చేశాడు. శుక్రవారం రాత్రి సమీప గ్రామమైన నాగరాజు పల్లి పొలాల్లోకి వెళ్లి రెండూ కలుపుకుని తాగాడు. కొంత కాలంగా భార్యతో.. తనకు భయంగా ఉంటోందని ఆత్మహత్య చేసుకుని చనిపోదామని అనిపిస్తుందనేవాడు. భర్త ప్రవర్తన పట్ల అనుమానంగా ఉన్న అతని భార్య శుక్రవారం వలపర్ల వచ్చి బంధువులతో కలిసి చిన్న పోలు ఆచూకీ కోసం వెతికినా ఫలితం కనిపించలేదు. శనివారం ఉదయం చిన్న పోలు మృతదేహాన్ని గుర్తించిన పొలం యజమాని సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగు చూసింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు చిన్న పోలు మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు మగ పిల్లలున్నారు.

జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తే మాదిగలకు నష్టం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్ర యూనిట్‌గా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ డిమాండ్ చేశారు. శనివారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చంద్రబాబునాయుడు వర్గీకరణ కోసం ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని.. అయితే లోపభూయిష్టమైన అమలు సాధ్యంకాని జిల్లా యూనిట్ వర్గీకరణ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని కోరారు. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేస్తే విద్య ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, ఆర్థిక అంశాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్ర యూనిట్‌గానే వర్గీకరణ చేస్తున్న నేపథ్యంలో ఏపీలో కూడా చంద్రబాబునాయుడు వర్గీకరణను జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్ర యూనిట్‌గా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘ నాయకులు మానికొండ శ్రీధర్, ఏటుకూరి విజయ్‌కుమార్, చిలువూరు నాగరాజు, భూషణం పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో మందు బాబులపై కేసులు

పెదకాకాని: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ టీపీ నారాయణస్వామి శనివారం తెలిపారు. వివరాలు.. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మద్యం తాగుతున్న వారిని గుర్తించేందుకు డ్రోన్‌తో నిఘా ఉంచారు. గ్రామ శివారులోని పొలాల్లో, చెట్ల కింద మద్యం తాగుతున్న వారు సులువుగా దొరికిపోతున్నారు. డ్రోక్ కెమెరా ద్వారా ఏ ప్రాంతంలో ఓపెన్ తాగుతున్నారో ఆ ప్రాంతానికి పోలీసు సిబ్బంది చేరుకుని వారిని అదుపులోకి తీసుకుంటున్నా రు. నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ వివరించారు.